క్లుప్తంగా

శివాలయంలో సంప్రోక్షణ పూజలు



గోకవరం శివాలయంలో సంప్రోక్షణ పూజలు నిర్వహిస్తున్న భక్తులు

గోకవరం: స్థానిక పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సంప్రోక్షణ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా ఇటీవల ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. అలాగే మండపాన్ని పునర్నిర్మించారు. ఈ మండపాన్ని ఆదివారం ప్రారంభించడంతో పాటు మండపంలో పరివార దేవతలకు స్థాపన కార్యక్రమం నిర్వహించారు. అలాగే స్వామి వారికి మహాసంప్రోక్షణ పూజలు జరిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బీజేపీ నేతల సమావేశం



గోకవరంలో ప్రతిజ్ఞ చేస్తున్న బీజేపీ నాయకులు

గోకవరం: స్థానిక లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం బీజేపీ నేతల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కాకినాడ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రామానికి చెందిన పలువురు బీజేపీలోకి చేరారు. బీజేపీ గోకవరం మండలాధ్యక్షుడిగా సత్తి వెంకటరెడ్డి, కార్యదర్శిగా ఇనకోటి బాపన్నదొరలను నియమించారు. అనంతరం దేశాభివృద్ధికి కృషి చేస్తామని పార్టీ నాయకులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టా మంగరాజు, ఏలూరి జిల్లా ఇన్‌చార్జి ఏపీఆర్ చౌదరి, జిల్లా ఉపాధ్యక్షురాలు కామినేతి జయశ్రీ, జగ్గంపేట కన్వీనర్ డి.కృష్ణవర్మ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత ఎంతో అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ హేమనళిని

రాజానగరం: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని, ముఖ్యంగా కౌమార దశ బాలికలు ఈ విషయంలో మరింత జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ హేమనళిని అన్నారు. మండలంలోని కొత్త వెలుగుబందలో ఆదివారం కౌమార దశ బాలికలకు, యువతులకు ఆరోగ్యం – పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ (దివాన్ చెరువు) సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారిని చైతన్యపరిచారు. అలాగే గర్భిణులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఫౌండేషన్ చైర్మన్ సుంకర వెంకటేశ్వరరావు, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

రహదారిపై ఇరుక్కుపోయిన ఊకలోడు లారీ



జగన్నాథపురం శివారున ప్రధాన రహదారిపై ఇరుక్కుపోయిన ఊక లోడు లారీ

గోకవరం: మండలంలోని జగన్నాథపురం గ్రామ శివారున ప్రధాన రహదారిపై ఆదివారం ఊక లోడు లారీ ఇరుక్కుపోయింది. భారీ లోడుతో ఉన్న ఊక లారీ గోతిలో పడి ఇరుక్కుపోవడంతో ప్రధాన రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న గోకవరం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

రేపటి నుంచి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎంపికలు

పెదపూడి: ఈ నెల 12, 13న పెదపూడిలో గాంధీ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలురు, బాలికలకు స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్‌లో జట్ల ఎంపికలు నిర్వహించనున్నామని పెదపూడి ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు గిరి తెలిపారు. ఆయన ఆదివారం పెదపూడిలో మాట్లాడుతూ ఈ నెల 12న బాలుర విభాగంలో 14 నుంచి 17 సంవత్సరాల వయసు గల విద్యార్థులకు తొమ్మిది క్రీడా విభాగాల్లో ఎంపికలు జరుగుతాయన్నారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, టెన్నికాయిట్, షటిల్ బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, చెస్, యోగా, త్రోబాల్ వంటి వాటిలో ఎంపికలు జరుతాయన్నారు. 13న బాలికలకు 14 నుంచి 17 సంవత్సరాల వయసుగల వారికి ఎంపికలు జరుగుతాయన్నారు.

మట్టి గణపతులతో గట్టి మేలు

- ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో పర్యావరణానికి హాని
- రసాయన రంగులతో వ్యాధులు సోకే ప్రమాదం



మట్టి విగ్రహాలు

బిక్కవోలు: వినాయక చవితి వచ్చేస్తోంది. గ్రామాల్లో ఇళ్లల్లోనూ, వీధివీధినా గణనాథులు కొలువుదీరి పూజలందుకోవడానికి సిద్ధం అవుతున్నారు. యువత ఎంతో ఉత్సాహంగా నిర్వహించే ఈ ఉత్సవాల్లో మట్టి ప్రతిమలనే పూజించాలని పర్యావరణ పరిరక్షకులు ప్రచారం చేస్తున్నారు. మట్టి వినాయకులను పూజించడమే ఆచారమని చెబుతున్నారు. గ్రామాల్లో వినాయక మంటపాల ఏర్పాటుకు నిర్వాహకులు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఈ ఏడాది అత్యధిక విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు.

అనపర్తి నియోజకవర్గంలో..

ఈ నెల 18న వినాయక చవితి సందర్భంగా అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాల్లోని 58 గ్రామాల్లో ఏటా సుమారు 300 పైగా వినాయక పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇవిగాక ప్రతి ఇంటా వినాయక ప్రతిమలతో పూజలు చేస్తారు. ఇలా ఏర్పాటయ్యే పందిళ్లలో అందం, ఆకర్షణ కోసం ఎక్కువగా రంగు రంగుల ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినాయక విగ్రహాలను వినియోగించడానికే ఎక్కువ మంది మొగ్గు చూపుతుండటం గమనార్హం. ఇదే పర్యావరణానికి పెద్ద సమస్యగా మారుతోంది. ఉత్సవ నిర్వాహకులు వాస్తవ పరిస్థితులు పరిగణనలోకి తీసుకుని, పర్యావరణ హితంగా వేడుకలు నిర్వహిస్తే మనల్ని మనం రక్షించుకోవడంతో పాటు పర్యావరణాన్ని రక్షించుకున్న వారమవుతామని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. ప్రతి ఒక్కరూ మట్టి ప్రతిమలనే ఏర్పాటు చేసుకుని ఉత్సవాలను నిర్వహించుకోవాలని సూచిస్తున్నారు. ఇప్పటికే కొంతమంది పర్యావరణ ప్రేమికులు, పలు స్వచ్ఛంద సంస్థల వారు మట్టి వినాయకులనే పూజించాలంటూ ప్రచారం చేస్తున్నారు.

మట్టి విగ్రహాలతో లాభాలు

- సహజ సిద్ధంగా లభించే బంక మట్టితో విగ్రహాలు తయారు చేసుకోవడం మంచిది.
- ఇవి నీటిలో సులభంగా కరిగిపోతాయి.
- మట్టి వినాయక విగ్రహాల నిమజ్జనంతో నీటి వనరులకు ఎలాంటి నష్టం ఉండదు.
- సహజ సిద్ధమైన చెట్ల ఆకులు, బెరడుతో తయారు చేసిన రంగులతో మట్టి బొమ్మలను ఆకర్షణీయంగా తయారు చేసుకోవచ్చు.

రసాయనాలతో అనర్థాలు

- ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలు కాలువలు, నదుల్లో నిమజ్జనం చేసినా కరగవు. వీటితో తయారైన ప్రతిమలో జిప్సం, గంధకం, మెగ్నీషియం, పాదరసం, సీసం, కాడ్మియం, ఆర్గానిక్స్, కార్బన్ అవశేషాలుంటాయి.
- వీటికి పూసిన రంగులు నీటిని కలుషితం చేస్తాయి. ఈ నీటిని తాగిన పశువుల జీర్ణకోశ వ్యవస్థ దెబ్బతింటుంది. నీటిలో ఉండే చేపలు, పీతలు వంటి జలచరాలు వ్యాధులు బారిన పడి చనిపోతాయి.
- రసాయనాలు కలిసిన నీటిని తాగితే శరీరంలో నరాలపై ప్రభావం చూపి క్యాన్సర్ వ్యాధికి దారి తీస్తుంది. చర్మవ్యాధులు వ్యాప్తి చెందుతాయి. రసాయనిక రంగులు కలిసిన నీరు పంట పొలాల్లో చేరి దిగుబడులు తగ్గడమే కాకుండా ఆహార ఉత్పత్తులను కలుషితం చేస్తుంది.



కొంకుదురులో విద్యార్థులు చేసిన మట్టి గణపయ్య

ఏటా మట్టి ప్రతిమల పంపిణీ



వినాయక చవితి సందర్భంగా యువత ఆధ్వర్యంలో ఏటా మట్టి గణపయ్య విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నాం. వీటివలన మా గ్రామంలో కొంతవరకైనా పర్యావరణం కలుషితం కాకుండా చేయడం మా యువత లక్ష్యం. ఈ ఏడాది మా యువత ఆధ్వర్యంలో ఎక్కువగా విగ్రహాలను పంపిణీ చేయడానికి ఏర్పాటు చేస్తున్నాం.

– పడాల కృష్ణారెడ్డి, యువనాయకుడు, పందలపాక

చిన్న విగ్రహాలు ఏర్పాటు చేసుకుంటే మంచిది



రసాయనిక రంగులతో పెద్ద విగ్రహాల కంటే మట్టితో చిన్న విగ్రహాలు ఏర్పాటు చేయడం వలన అటు ప్రమాదాలు జరగకుండా ఉండడమే కాక, పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుంది. చిన్న విగ్రహాలు ఏర్పాటు చేయడం వలన నిమజ్జన సమయంలో ప్రమాదాలు నివారించవచ్చు.

– పి.బుజ్జిబాబు, ఎస్సై బిక్కవోలు

పర్యావరణ పరిరక్షణకు పాటుపడదాం

అనపర్తి: వినాయక చవితి సందర్భంగా మట్టితో **తయారు చేసిన** వినాయక ప్రతిమలనే ఉపయోగించి **పర్యావరణ** పరిరక్షణకు పాడాలని స్థానిక **సనాతన ధర్మ** పరిరక్షణ సమితి వ్యవస్థాపక **అధ్యక్షుడు రెడ్డి** సురేష్‌శర్మ అన్నారు. సమితి **ఆధ్వర్యంలో ఆ**దివారం నిర్వహించిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన కర్రి సుధాకర్‌రెడ్డి, అలివేలు దంపతులు పాల్గొని మట్టితో చేసిన గణపతి ప్రతిమల పంపిణీని ప్రారంభించారు. సమితి కార్యదర్శి రెడ్డి సతీష్, రెడ్డి రామ్మోహన్‌రావు, సర్వలక్ష్మి దంపతులు, కర్రి విజయభాస్కర్‌రెడ్డి విజయ దంపతులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనుల ప్రారంభం



పందలపాకలో నిర్మాణం పూర్తయిన వైఎస్సార్ క్లినిక్

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలో రూ.90లక్షలతో నిర్మించిన పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రారంభిస్తున్నట్టు సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం గ్రామంలోని రెండు వైఎస్సార్ క్లినిక్‌లు, ఒక రైతు భరోసా కేంద్రం, పలు సీసీ రోడ్లను ఆయన ప్రారంభిస్తున్నారని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ఠాపన



పాతమునగాల ఆలయంలో జక్కంపూడి విజయలక్ష్మి



శ్రీకృష్ణపట్నం దుర్గామాత ఆలయంలో పూజలు

మధురపూడి: కోరుకొండ మండలం పాత మునగాలలో వరసిద్ధి వినాయక ఆలయ ప్రతిష్ఠాపన ఆదివారం భక్తిశ్రద్ధలతో జరిగింది. స్థానిక తాగునీటి చెరువు వద్ద ఇటీవల టీటీడీ ఆర్థిక సహకారంతో నిర్మించిన ఈ ఆలయాన్ని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మండపాక కోటేశ్వరరావు, నాగా గోవింద్, తోట సాయిబాబు, ఎంపీటీసీ చింతాకుల లోవరాజు పాల్గొన్నారు.

రాజానగరం: శ్రీకృష్ణపట్నంలో పునర్నిర్మించిన దుర్గామాత ఆలయంలో వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ ఆదివారం వైభవంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవం జరిగింది. ఈ సందర్భంగా భారీ ఎత్తున అన్న సమారాధన చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, వైఎస్సార్ సీపీ మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, కోలపాటి వెంకన్న, మండారపు దుర్గారావు, రౌతుల చక్రవర్తి, డి.సూర్యానారాయణ పాల్గొన్నారు.

జగన్ పాలనకు సంపూర్ణ మద్దతు

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన వారికి కండువాలు చేసి ఆహ్వానం పలుకుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: సంక్షేమ పథకాలతో పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అన్ని వర్గాల ప్రజల మద్దతు లభిస్తోందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు కొండపల్లి దుర్గారావు, బుడంపర్తి రాము సమక్షంలో రఘుదేవపురానికి చెందిన బీసీ నాయకులు వంగూరి వెంకటరాజుతోపాటుగా అధిక సంఖ్యలో కార్యకర్తలు ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. రాజమహేంద్రవరం తన కార్యాలయంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా వారికి పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా తెలుగుదేశం పార్టీ కోసం బీసీ నాయకులు వంగూరి వెంకట రాజు పని చేశారన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమ పాలనకు అందరూ ఆకర్షితులవుతున్నారన్నారు. దీంతో వైఎస్సార్ సీపీలో స్వచ్ఛందంగా చేరుతున్నారన్నారు. వెంకట రాజు సేవలను రానున్న వైఎస్సార్ సీపీ తప్పక వినియోగించుకుంటుందన్నారు. నియోజకవర్గంలో గడచిన నాలుగున్నరేళ్లలో అర్హత కలిగిన వారందరికి సంక్షేమ పథకాలు అందించడంతో పాటు నియోజకవర్గం అభివృద్ధికి విశేష కృషి చేశామన్నారు.

గ్రామ స్వరాజ్యం ఘనత సీఎం జగన్‌దే

- ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి
- రంగాపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం



లబ్ధిదారుకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: దేశ చరిత్రలోనే గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని రాష్ట్రంలో అమలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం మూడవరోజు రంగాపురం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గడప గడపకూ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత ఇంటింటికీ అందజేసిన సంక్షేమ పథకాలు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో అర్హులైన ప్రజలందరికీ కులం, మతం, పార్టీ భేదం లేకుండా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి తేడా గమనించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గండికోట వీరభద్రరావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, ఉపసర్పంచ్ కె.శాంతి కుమారి, సచివాలయ కన్వీనర్‌లు నక్క వీర వెంకటరమణ, ఇజ్జన లలితకుమారి, సాగి రాజేష్, నాయకులు గండికోట అప్పారావు, ములపాటి బుజ్జిరాజు, నీలపాల కృష్ణ, పోట్రు రాంబాబు, జి.వెంకట్రావు పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం



బలభద్రపురంలో సచివాలయం భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: మండలంలోని బలబద్రపురం గ్రామంలో రూ.25 లక్షలతో నిర్మించిన సచివాలయం1 మొదటి అంతస్తు భవనాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన పాలనను అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ప్రవేశ పెట్టారని అన్నారు. ఈ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న అనేక రకాల సేవలు అందడంలో ఏమైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించేందుకు కూడా సచివాలయ వ్యవస్థ ఉపయోగపడుతుందన్నారు. జెడ్పీటీసీ రొంగల పద్మావతి, సర్పంచ్ బుంగా రామారావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లమిల్లి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

గణపతి నవరాత్ర ఉత్సవాలకు పందిరి రాట ముహూర్తం



కుతుకులూరులో పందిరి రాటను ఏర్పాటు చేస్తున్న వీర్రెడ్డి దంపతులు

అనపర్తి: ఈ నెల 18న వినాయక చవితిని పురస్కరించుకుని మండలంలోని కుతుకులూరు బసివిరెడ్డి సెంటర్ వద్ద నిర్వహించే గణపతి నవరాత్ర ఉత్సవాలకు ఆదివారం ఆలయ ప్రాంగణంలో పందిరి రాటను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన గొలుగూరి వీర్రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి పందిరిరాటను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సంజీవరెడ్డి ఫ్రెండ్స్ సర్కిల్ ప్రతినిధి కొవ్వూరి మురళీకృష్ణారెడ్డి, జెడ్పీ ఉన్నత పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ కొవ్వూరి కొండారెడ్డి, వ్యవసాయ సలహామండలి చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పందిరిరాట ముహూర్తం

బిక్కవోలు: మండలంలోని పందలపాక వెలంపేట వద్ద గణపతి నవరాత్రులు ఉత్సావాలకు రాట మంచి కార్యక్రమం చేశారు. ఆదివారం వెలంపేట రామాలయం వద్ద ముందుగా గణపతికి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కూనిరెడ్డి సాంబశివ మాట్లాడుతూ ఈ నెల18 నుంచి 27 వరకు గణపతి నవరాత్రులు నిర్వహిస్తున్నామని తెలిపారు.

పారదర్శకంగా పింఛన్ల పంపిణీ

ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి



లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్మన్ కృష్ణారెడ్డి

అనపర్తి: కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులందరికీ పారదర్శకంగా పింఛన్లు, వివిధ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని రామవరం గ్రామ సచివాలయంలో ఆదివారం గ్రామ పరిధిలో నూతనంగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ గిరడా గంగాభవాని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని కృష్ణారెడ్డి మాట్లాడుతూ వివక్షలేని సంక్షేమ పాలనను అందిస్తున్న సీఎం జగన్ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిజమైన అర్హులకు సంక్షేమ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీల ఆమోదం పొందాల్సి వచ్చేదని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన గ్రామ సచివాలయ వ్యవస్థతో ఎవరి సిఫారసులు, అవినీతికి తావులేకుండా పూర్తి పారదర్శకతతో అర్హులను ఎంపిక చేసి సంక్షేమ ఫలాలు గడప ముంగిటకే అందిస్తున్నారని అన్నారు. అనంతరం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యులు నల్లమిల్లి భాగ్యలక్ష్మి, గొలుగూరి గౌతమి, వార్డు సభ్యులు నల్లమిల్లి వరలక్ష్మి, కర్రి రుక్మిణికుమారి, సచివాలయ కన్వీనర్లు నల్లమిల్లి సూర్రెడ్డి, మేడపాటి వాసు, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ గుడిమెట్ల వెంకటరెడ్డి, సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ మల్లిడి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

నేడే రంగాపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం

బిక్కవోలు: మండలంలోని రంగాపురం గ్రామంలో నాలుగోరోజు సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు సర్పంచ్ గండికోట వీరభద్రరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మధ్యాహ్నం 2గంటల నుంచి ఈ కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని ఆయన కోరారు.

దేశ సమైక్యతకు ఎన్‌సీసీ అవసరం

రాజానగరం: క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడంతో పాటు దేశ సమైక్యత, సమగ్రతకు పాటుపడేలా యువతను తీర్చిదిద్దడంలో ఎన్‌సీసీ పాత్ర గణనీయమైనదని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ అన్నారు. గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన 18వ బీఎన్ ఎన్‌సీసీ ఫైరింగ్ శిక్షణ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన సభలో పద్మశ్రీ మాట్లాడుతూ ప్రతి కళాశాలలోను ఎన్‌సీసీ ఉండాలన్నారు. ఎన్‌సీసీలో చేరడం వలన భారతీయ పౌరుడిగా తన బాధ్యతలను తెలుసుకోవడంతోపాటు సమర్థంగా నిర్వహించే అవకాశం ఏర్పడుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణ అవసరాన్ని గుర్తించి, గ్రామీణ ప్రాంతాలలో ప్రజలలో చైతన్యం తీసుకురావాల్సి ఉన్నారు. కర్నల్ వివేక్ సావస్ గౌర్ మాట్లాడుతూ పునీత సాగర్ అభియాన్ అంటే ఏమిటి, ఎప్పుడు ప్రారంభించారు అనే విషయాలను తెలియజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కెప్టెన్ ఏవీవీఎస్ శర్మ, ప్రిన్సిపాల్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బంద్‌లు, ర్యాలీలు నిషేధం

సీతానగరం: 144 సెక్షన్ అమల్లో ఉన్నందున బంద్‌లు, ర్యాలీలు, నిరసనలు, ధర్నాలు, ఊరేగింపులు నిషేధమని తహసీల్దార్ ఎస్. సత్యనారాయణ, ఎస్సై కె.చిరంజీవి ఆదివారం హెచ్చరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నలుగురు లేదా ఆపైపై ఎక్కువమంది గుమిగూడరాదన్నారు. దౌర్జన్యాలు, దాడులకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

గోకవరం: గోకవరం మండలంలో 144 సెక్షన్ అమలులో ఉందని ఎస్సై యువి శివనాగబాబు ఆదివారం తెలిపారు. అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించకూడదన్నారు. పబ్లిక్ స్థలంలో ముగ్గురు కంటే ఎక్కువ మంది ఉండకూడదన్నారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

మధురపూడి: కోరుకొండ సర్కిల్ స్టేషన్ పరిధిలో 144 సెక్షన్ విధించినట్టు సీఐ ఉమా మహేశ్వరరావు తెలిపారు. ఎటువంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడినా, సంఘవిద్రోహ కార్యక్రమాలను నిర్వహించ తలపెట్టినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ప్రాంతంలో సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించకూడదన్నారు. అలాగే టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు అరెస్టు నేపథ్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించ తలపెట్టిన 23 మంది టీడీపీ నాయకులకు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

బిక్కవోలు: మండలంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్టు ఎస్సై పి.బుజ్జిబాబు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రాష్ట్ర వ్యాప్తంగా అమలులో భాగంగా మండలంలోనూ అమలు చేస్తున్నట్టు తెలిపారు.

సీపీఐ నేత సూర్యారావు మృతి



సూర్యారావు(ఫైల్)

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామానికి చెందిన సీపీఐ నాయకుడు పిచ్చిక సూర్యారావు(88) మృతి చెందారు. పందలపాక చేనేత సొసైటీకి 20 సంవత్సరాలు ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా పనిచేశారు. అనారోగ్యంతో ఉన్న ఆయనను శనివారం రామచంద్రపురంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్ళగా మృతి చెందారు.